క్లుప్తంగా

విగ్రహాల ప్రతిష్ఠ



విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్న గ్రామస్తులు

మెళియాపుట్టి: ఇటీవల జోడూరు గ్రామంలోని కొండపై సంతోషి మాత, వినాయక విగ్రహాలు ఉన్నట్లు అదే గ్రామానికి చెందిన విద్యార్థికి కలలోకి వచ్చినట్లు చెప్పాడు. అక్కడకి వెళ్లి చూసేరికి పురాతన రాతి విగ్రహాలు కనిపించాయి. దీంతో గ్రామానికి మంచి జరుగుతుందనే నమ్మకంతో గురువారం గ్రామస్తులంతా కలిసి విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుడి కట్టే యోచనలో ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ప్రతిరోజూ విగ్రహాలకు నిత్యపూజలు నిర్వహిస్తామన్నారు.

70 మందికి నేత్ర పరీక్షలు



వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

సారవకోట: మండలంలోని అలుదు గ్రామంలో పరిమళ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శంకర్ ఫౌండేషన్‌కు చెందిన కంటి వైద్యురాలు కూన అరుణ 70 మంది కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 32 మందికి శస్త్ర చికిత్సల కోసం శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, పరిమళ చారిటబుల్ ట్రస్టీ వరుదు వంశీకృష్ణ, దేవిప్రసాద్, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, సర్పంచ్‌లు శంకరబాబు, దండాశి, వైఎస్సార్‌సీపీ నాయకులు బైరాగినాయుడు, పల్లి కృష్ణారావు, రాజాపు అప్పన్న, రెడ్డి పాపయ్య, తంగి రమణ, తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మధు

సారవకోట: రైతులు నానో యూరియా వాడకంపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయశాఖ నరసన్నపేట ఏడీఏ ఎల్.వి.మధు సూచించారు. గురువారం మండలంలోని వెంకటాపురంలో నానో యూరియాను డ్రోన్ సహాయంతో ఎలా పిచికారీ చేయాలో అవగాహన కల్పించారు. ఆ గ్రామానికి చెందిన రైతు దాము సూర్యనారాయణకు చెందిన 5 ఎకరాల పొలంలో డ్రోన్ సహాయంతో ఎకరాకు 500 ఎం.ఎల్ చొప్పున నానో యూరియా పిచికారీ చేయించారు వ్యవసాయాధికారి వెంకటరావు ఉన్నారు.

తాగునీటికి కటకట




ట్యాంకర్ ద్వారా తాగునీరు అందిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: మండలంలోని మర్రిపాడు–సి పంచాయతీ పరిధిలో గల జలకలింగపురంలో కుళాయిలు గత మూడు రోజులుగా రావడం లేదు. దీంతో తాగునీటికి అవస్థలు పడుతున్నామని గ్రామానికి చెందిన దుక్క బాలరాజు, గ్రామస్తులు పలువురు తెలిపారు. తాగునీటి సమస్య ఉందని పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమస్య ఉన్న పైప్‌లైన్లను చూపించడం జరిగిందన్నారు. అయినా పట్టించుకోలేదని ఆరోపించారు. గురువారం కొంతమంది దాతలు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారన్నారు.

ఆలయ కమిటీ నియామకం

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరాలయ కమిటీని ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ట్రస్టు బోర్డు చైర్మన్‌గా పొట్నూరు వీరభద్ర స్వామి, సభ్యులుగా మావుడూరి జగదీష్ బాబు, బోయిన శ్రీదేవి, కూన గాయిత్రి, దొంతుకుర్తి బాలకృష్ణ, లక్కోజి విశ్వనాథం, దుప్పలపూడి పద్మ, యరగళ్ల సుశీలను నియమించింది. ఈ మేరకు ఎండోమెంట్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

కార్డెన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న వాహనాలను ప్రదర్శిస్తున్న పోలీసులు

బూర్జ: మండలంలోని అప్పలపట్నాయకునిపేట (ఏపీ పేట)లో ఎస్ఐ ఎం.ప్రవల్లిక ఆధ్వర్యంలో గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ఎటువంటి పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా దొంగ వాహనాలు కొనుగోలు చేసినా, విక్రయించినా, పత్రాలు లేని వాహనాలు నడిపినా అటువంటివి సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయించినా.. నిల్వ చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వంద రోజులైనా..



గోకర్ణపురం గ్రామానికి వెళ్లే దారిలో ఉధృతంగా నీటి ప్రవాహం



బ్రిడ్జి శంకుస్థాపన కోసం వేసిన శిలాఫలకం



గోకర్ణపురం గ్రామానికి వెళ్లే దారిలో నీటి ప్రవాహం రాక ముందు

- గోకర్ణపురంలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే
- నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు.
- వర్షాకాలంలో నిలిచిపోతున్న రాకపోకలు
- ఇటీవల కురిసిన వర్షాలకు ఉధృతంగా ప్రవహించిన రాధాసాగరం
- వంతెన నిర్మించాలని వేడుకుంటున్న ప్రజలు

మెళియాపుట్టి: గతకొన్నేళ్లుగా గోకర్ణపురం గ్రామానికి వంతెన లేక అక్కడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం వస్తే వారికి కష్టాలు మొదలైనట్లే. సమీపంలోనున్న ఒడిశాలోని రాధాసాగరం నుంచి ఉధృతంగా నీటి ప్రవాహం వచ్చి గ్రామానికి వెళ్లే లోలెవల్ వంతెనపై నుంచి అతివేగంగా వరద నీరు పారుతుంది. గ్రామస్తుల అవసరాలకు నిత్యం గొప్పిలి గ్రామానికి వెళ్లే పరిస్థితి. వర్షాకాలం వచ్చిందటే విద్య, వైద్యానికి కూడా దూరం అవుతున్నారు. సమస్యలన్నీ పరిష్కారం అవ్వాలంటే.. వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి ఉపాధి హామీ నిధుల నుంచి 2025 మార్చి 28న రూ.90 లక్షలు మంజూరయ్యాయి. 2025 మే 10న పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి 100 రోజులు దాటింది. అయినా బ్రిడ్జి నిర్మాణానికి అడుగులు ముందుకు పడలేదు.

ప్రతీ ఏడాది ప్రమాదాలే..

ప్రతీ సంవత్సరం లోలెవల్ వంతెన నుంచి ప్రవహిస్తున్న వరద దాటే సాహసం చేసి పలువురు మృత్యువాత పడ్డారు. పలువురు కొట్టుకుపోయి గ్రామస్తుల సహకారంతో బయటపడ్డారు. 2020 అక్టోబర్‌లో గ్రామానికి చెందిన వై.శ్రీనివాసరావు గల్లంతై మూడు రోజుల తర్వాత మృతదేహం బయటపడింది. 2021లో పెదంచల గ్రామానికి చెందిన రమేష్ అనే యువకుడు ద్విచక్రవాహనంతో కొట్టుకుపోయాడు. స్థానికులు కాపాడారు. 2023 ఆగస్టులో నందవ గ్రామానికి చెందిన సవర దండాశి చుట్టం చూపుగా వెళ్లి ద్విచక్రవాహనంతో పడిపోయి కొట్టుకుపోయాడు. స్థానిక యువకులు బయటకి తీసి ప్రాణాలు కాపాడారు. బ్రిడ్జి నిర్మాణం జరగకపోతే ప్రతీ ఏడాది ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

ప్రతీ సంవత్సరం ఇబ్బంది పడుతున్నాం..



వర్షాకాలం వస్తే మాకు భయం పట్టుకుంటుంది. నీరు మా గ్రామానికి వచ్చే రహదారి మీదుగా ప్రవహించడంతో అవస్థలు పడుతున్నాం. బయటికి వెళ్లడానికి భయవేస్తుంది. సరుకులు తెచ్చుకోవడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రతీ సంవత్సరం మా గ్రామానికి చెందిన పలువురు నీటి ఉధృతికి కొట్టుకుపోతున్నారు. ఒకరు ప్రాణాలు సైతం కోల్పోయారు. అధికారులు వంతెన నిర్మించాలి.

– సాప నాగేశ్వరరావు, గోకర్ణపురం

బ్రిడ్జి డిజైన్ వస్తే పనులు ప్రారంభిస్తాం



విశాఖపట్నానికి చెందిన డిజైన్స్ టు డిజైన్స్ అనే ప్రైవేట్ కన్సల్టెన్సీ కి బ్రిడ్జ్ డిజైన్ పనులు అప్పగించాం. ఆ డిజైన్ రాగానే పనులు ప్రారంభిస్తాం. వచ్చే నెలలో పనులు ప్రారంభమవడానికి అవకాశం ఉంది.

– ఆనంద్, పీఆర్ ఏఈ, మెళియాపుట్టి

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి నిర్మల

మెళియాపుట్టి: న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సహాయాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని, గిరిజనుల కోసం రూపొందించిన చట్టాల గూర్చి తెలుసుకోవాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల అన్నారు. గురువారం రామచంద్రాపురం గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. షెడ్యూల్డ్ కులాలు, తెలగల గూర్చి ఎన్నో చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన ఉండాలన్నారు. సమస్యలు ఎదురైనచోట బయపడకుండా న్యాయ వ్యవస్థను ఆశ్రయించి పరిష్కరించుకోవాలన్నారు. టెక్కలి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పి.విజయ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు ఎండయ్య, న్యాయవాదులు, ఎస్ఐ పి.రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవలు సక్రమంగా అందాలి



సబ్‌జైల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జడ్జి వాణి

పాతపట్నం: స్థానిక సబ్ జైల్‌లో ఉన్న ఖైదీలకు న్యాయ సేవలు సక్రమంగా అందేలా చూడాలని నరసన్నపేట కోర్టు (జూనియర్ డివిజన్) సివిల్ జడ్జి, పాతపట్నం కోర్టు ఇన్‌చార్జి జడ్జి ఎస్.వాణి అన్నారు. పాతపట్నం సబ్‌జైల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును గురువారం నిర్వహించారు. సబ్ జైల్‌ను పరిశీలించారు. అక్కడ ఉన్న ఖైదీలతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలు, న్యాయపరమైన సలహాలపై ఆరా తీశారు. దీర్ఘ కాలంగా శిక్ష పడినవారికి న్యాయవాదులు ఉన్నారా, లేదా అన్న అంశంపై జైల్ సూపరింటెండెంట్ ఎం.సన్యాసిరావును అడిగి తెలుసుకున్నారు. ఖైదీల రికార్డులను పరిశీలించారు. న్యాయవాదులు, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

అడుగుకో గుంత..



అచ్చిపోలవలస వద్ద గుంతలమయంగా ఉన్న రోడ్డు



కనిమెట్ట వద్ద గోతుల్లో నిండిన వర్షం నీరు

- కనిమెట్ట–రాపాక మార్గంలో నరకం చూస్తున్న ప్రయాణికులు
- రోడ్డుపై పేరుకుపోయిన కంకర, ఇసుక
- వాహనం స్పీడ్ పెంచామో.. ప్రమాదం గ్యారెంటీ

పొందూరు: మండలంలోని పలు రహదారులు నరకం చూపిస్తున్నాయి. పూర్తిగా చిద్రమై.. అడుగు లోతు గుంతలతో అధ్వానంగా తయారయ్యాయి. ఎంతలా అంటే ద్విచక్ర వాహనంపై 10 కిలో మీటర్ల వేగం కంటే ఎక్కువ వెళ్తే ప్రమాదానికి గురవ్వడం ఖాయం. ఇంతకీ ఎక్కడ అనుకుంటున్నారా.. కనిమెట్ట నుంచి రాపాక వెళ్లే రహదారి దుస్థితి ఇది. రోజురోజుకీ రోడ్డు పరిస్థితి దారుణంగా తయారవుతోంది.

14 కిలో మీటర్లు 40 నిమిషాలు..

శ్రీకాకుళంలోని సింహద్వారం సమీపంలో ఉన్న కనిమెట్ట రోడ్డు నుంచి రాపాక వరకు 14 కిలో మీటర్లు దూరం. రహదారి అధ్వాన స్థితి కారణంగా 40 నిమిషాల సమయం పడుతోంది. ఉదయం 8 నుంచి 10 గంటలు... సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు వాహనాలతో రద్దీగా ఉండే ఈ రహదారిలో తరచూ ప్రమాదాలు జరుతున్నాయి. ఓ వైపు క్వారీలు.. మరో వైపు గ్రావెల్, ఇసుకను తరలించే ట్రాక్టర్లు, స్కూల్ విద్యార్థుల ఆటోలు వందల సంఖ్యంలో రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ మార్గంలో కొన్ని ప్రాంతాల్లో రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. ఒక్కోచోట రెండుగా విడిపోయింది. దీనికి తోడు మలుపులు ఎక్కువగా ఉండే ఈ దారిలో అడుగు లోతున గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారాయి.



తోలాపి మలుపు వద్ద ఏర్పడిన గొయ్యి

చీకటి పడితే కష్టమే....

సాయంత్రం ఆరుదాటితే చాలు ఈ మార్గంలో ప్రయాణం కష్టమే. మలుపులు వద్దే పెద్ద, పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్డు ఇరువైపులా ఉన్న చెరువులు వద్ద ప్రమాద నియంత్రికలు ఏర్పాటు చేయలేదు.

నరకం చూస్తున్నాం...



శ్రీకాకుళం నగరానికి వెళ్లేందుకు ఈ మార్గమే మాకు అనుకూలం. రహదారి అధ్వానంగా ఉంది. వర్షం కురిస్తే గుంతలు వర్షం నీటితో నిండిపోతున్నాయి. ఏది రోడ్డో.. ఏది గుంతో తెలియని పరిస్థితి. నరకం చూస్తున్నాం.

– కూన కిరణ్ కుమార్, మజ్జిలిపేట

రోడ్డును బాగుచేయాలి



రాపాక నుండి సింహద్వారం వరకు రోడ్డు పూర్తిగా పాడైంది. రోడ్డుపై కంకర, ఇసుక మేటలతో మలుపుల వద్ద వాహనాలు జారిపోతున్నాయి. అధికారులు దృష్టి సారించి రోడ్డును బాగుచేయాలి.

– కొంచాడ రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, రాపాక గ్రామం, పొందూరు మండలం

గంజాయి సాగుపై ప్రత్యేక నిఘా



డాగ్ స్క్వాడ్‌తో అన్వేషణ చేస్తున్న పోలీసులు

పొందూరు: గంజాయి సాగు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. పొందూరు పరిసర ప్రాంతాల్లో గంజాయి సాగుపై గురువారం ఎస్ఐ ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. పొందూరు పట్టణ సరిహద్దుల్లోని పంట పొలాలు, అనుమానిత ప్రాంతాల్లో డాగ్‌స్క్వాడ్‌తో అన్వేషణ చేపట్టారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

అర్హుల పింఛన్లు తొలగించడం అన్యాయం

కొత్తూరు: అనర్హత పేరుతో దివ్యాంగుల పింఛన్లను రద్దు చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని కురిగాంలో విలేకర్లతో మాట్లాడారు. రీ వెరిఫికేషన్ పేరుతో కూటమి ప్రభుత్వం పింఛన్‌లు తగ్గిస్తోందని విమర్శించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ఇంతవరకు దివ్యాంగులకు ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు చేయలేదన్నారు. వ్యవసాయశాఖ మంత్రిగా అచ్చెన్నాయుడు ఉన్నప్పటికీ జిల్లా రైతులకు యూరియా అందడం లేదన్నారు. సర్పంచ్‌లు ధర్మారావు, అశోక్ కుమార్, రాజులు నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, జగన్ పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

నరసన్నపేట/మెళియాపుట్టి/కొత్తూరు: వినాయక మండపాలు ఏర్పాటు చేస్తే విధిగా ఆయా కమిటీల ప్రతినిధులు అనుమతులు తీసుకోవాలని కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్, నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్, మెళియాపుట్టి ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. అనుమతులు లేకుండా మండపాలు పెట్టవద్దన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి పోలీసు శాఖ యాప్ సిద్ధం చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పరిశీలించి అనుమతులు ఇస్తామన్నారు. మైక్ సౌండ్ తగ్గించాలని, డీజేలు వాడవద్దని సూచించారు. క్రమశిక్షణగా నిమజ్జనం చేయాలన్నారు.

పరామర్శ..



సూర్యనారాయణను పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

జలుమూరు: మండలంలోని అల్లాడపేటకు చెందిన గురువిల్లి సత్యనారాయణ రాజమండ్రిలో బుధవారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ధర్మాన కృష్ణచైతన్య గురువారం అల్లాడపేట వెళ్లి మృతుని తండ్రి సూర్యనారాయణను పరామర్శించి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ కె.శ్రీనివాసరావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు దారుణం



- వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి

హిరమండలం: దివ్యాంగుల పింఛన్లు తొలగించడమేనా కూటమి ప్రభుత్వ సుపరిపాలన అని వైఎస్సార్‌సీపీ క్రమ శిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రశ్నించారు. గురువారం పాతపట్నంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది పింఛన్ల తొలగింపుపై ఆందోళన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దివ్యాంగులకు మెరుగైన జీవనాన్ని అందించేందుకు అర్హులందరికీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లు అందించారన్నారు. పేదల బతుకుల్లో వైఎస్ జగన్ వెలుగులు నింపారన్నారు. రీ వెరిఫికేషన్ పేరిట వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల పింఛన్లు తొలగించడం అన్యాయమన్నారు. కేవలం రాజకీయ కక్షతో గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారుల పింఛన్ల తొలగింపు ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. కూటమి నేతల సిఫారసులకు పెద్దపీట వేస్తూ.. నచ్చిన వారి పింఛన్లు ఉంచుతున్నారని.. నచ్చని వారివి తొలగిస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా వారందరీ పింఛన్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో న్యాయపోరాటం చేసేందుకు సైతం వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. వచ్చే ఎన్నికల్లో కూటమికి తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

'మోసం చంద్రబాబు నైజం'



ఆమదాలవలస రూరల్: మాకవరంలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆమదాలవలస రూరల్: మోసాలతోనే సీఎం చంద్రబాబు, కూటమి నాయకులు పబ్బం గడుపుతున్నారని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మండలంలోని దూసిపేటలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోను అందించారు. పార్టీ నాయకులు తిర్లంగి శ్రీనివాసరావు, మురళి, దానేటి రాము, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సైలాడ దాసునాయుడు వివిధ విభాగల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కొత్తూరు: సూపర్ సిక్స్‌తోపాటు అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేశారని వైస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని మాకవరం, కురిగాం గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌లను అందించారు. సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు యర్లంకి ధర్మారావు, సేపాన అశోక్, రాజులు నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: మాకవరంలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆక్రమణల తొలగింపు

సరుబుజ్జిలి: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆక్రమణలపై పలుమార్లు సాక్షిలో కథనాలు రావడంలో అధికారులు స్పందించారు. ఈ మేరకు గత వారం రోజులుగా ఆక్రమణలకు గురైన స్థలాలను గుర్తించారు. వాటిని గురువారం పూర్తిస్థాయిలో తొలగింపు చేపట్టారు. రహదారి మధ్యభాగం నుంచి ఇరువైపులా 35 అడుగుల మేర విస్తరణ చేపట్టేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పోలీస్ అధికారులు దగ్గరుండి ఆక్రమణల తొలగింపు పనులు పూర్తిచేశారు.



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

కూటమిలో విభేదాలు

హిరమండలం: పాతపట్నం నియోజకవర్గంలో కూటమిలో ఉన్న విభేదాలు తాజాగా బయటపడ్డాయి. హిరమండలం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జనసేన మండల అధ్యక్షుడు మామిడి రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా టీడీపీకి చెందిన కొవిలాపు కృష్ణమాచారి, ఇతర సభ్యులు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుతోపాటు జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ హాజరయ్యారు. జేససేన పార్టీకి చెందిన సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, మహిళా నేత భవాని, నియోజకవర్గ ఇన్‌చార్జి గేదెల చైతన్య ఈ కార్యక్రమానికి ముఖం చాటేశారు. వాస్తవానికి ఏఎంసీ చైర్మన్‌గా కొవిలాపు కృష్ణమాచారి పేరును అధిష్టానానికి స్థానిక ఎమ్మెల్యే పంపించారు. కానీ అనూహ్యంగా జనసేనకు అధ్యక్ష పదవిని కేటాయించారు. అధ్యక్షుడి పేరును మార్చు చేయాల్సిందేనని మంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్యే కోరినా ఫలితం లేకపోయింది. ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యేతో వేదికను పంచుకునేందుకు ఇష్టంలేక నియోజకవర్గ జనసేన నేతలు ముఖం చాటేసినట్టు తెలుస్తోంది. ముమ్మందు ఈ విభేదాలు ఏ స్థాయికి వెళ్తాయోనని కూటమి నాయకులు, ప్రజలు చర్చించుకుంటున్నారు.

సంక్షిప్తంగా..

డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస మండలంలోని తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు సంబంధించి కంప్యూటర్ మేథమెటిక్స్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ బోటనీ, బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్ కోర్సులు ఉన్నట్లు తెలిపారు. కళాశాల పని దినాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన రుచిగా ఉండాలని డిప్యూటీ ఈఓ విజయకుమారి అన్నారు. మండలంలోని బొరిగివలస, నరసన్నపేట బోర్డు స్కూళ్లను గురువారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎంఈఓ శాంతారావు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయండి

నరసన్నపేట: మండలంలోని జమ్ము లేవుట్‌లో పునాదులు, గోడలతో ఉన్న ఇళ్లను పూర్తిచేయాలని జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లతో గురువారం సమీక్ష చేశారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న ఇళ్లను పూర్తి చేయించాలన్నారు. ఎంపీడీఓ ప్రసాద్, హౌసింగ్ ఏఈ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థికసాయం

బూర్జ: మండలంలోని గుత్తావల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఉత్తమ మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థులకు శ్రీరామరక్ష ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఆర్థికసహాయం అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొడ్డేపల్లి శ్రీరామచంద్రమూర్తి గత 12 ఏళ్లుగా విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నలిచిన సాకేటి మనోహరరావుకి రూ.5 వేలు, సుంకరి నానికి రూ.4 వేలు, పొన్నాన రోహిత్‌కు రూ.3 వేల చొప్పున అందజేశారు. శ్రీరామచంద్రమూర్తి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు పురస్కారం

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరంలో అత్యధికంగా మార్కులు సాధించిన ఎల్.స్రవంతిని అభినందించారు. మండలంలోని కర్లెమ్మ గ్రామానికి చెందిన ఎద్దు సుందరనారాయణ వరహాలమ్మ చారటబుల్ ట్రస్టు చైర్మన్ ఎద్దు గోపాలదాసునాయుడు గురువారం రూ.12 వేలు అందజేశారు. ఇటీవల బదిలీ అయిన ప్రిన్సిపాల్ బండారి రవికుమార్, ప్రిన్సిపాల్ ధనుజంయరావు, అధ్యాపకులు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.